ప్రజాశక్తి
గురువారం 10 అక్టోబరు, 2024
శ్రీకాకుళం

నేడు ప్రజా దర్బార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

శ్రీకాకుళం నియోజకవర్గంలో శ్రీకాకుళం రూరల్ మండలానికి సంబంధించిన ప్రజా దర్బార్‌ను ఈనెల పదో తేదీన తహశీల్దార్ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు వినతులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. రూరల్ మండలానికి చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయొచ్చని తెలిపారు. కార్యక్రమానికి రూరల్ మండలానికి సంబంధించిన అధికారులందరూ హాజరవుతారని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు

సమాయత్తం

- షెడ్యూల్‌ను విడుదల చేసిన ప్రభుత్వం
- ఈనెల 16 నుంచి ప్రక్రియ ప్రారంభం
- ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తున్న అధికారులు
- వచ్చే నెల 15న ఎన్నికల నోటిఫికేషన్

సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. భారీ, మధ్య, చిన్న నీటిపారుదల ప్రాజెక్టుల వారీగా సాగునీటి సంఘాలకు వచ్చే నెలాఖరు నాటికి ఎన్నికలు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఆయకట్టు, డిస్ట్రిబ్యూటరీలు, ప్రాజెక్టుల పరిధిలో కొత్తగా వచ్చిన ప్రాంతాలను కలిపి ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను వెలువరించింది. ఈనెల 16వ తేదీ నుంచి ప్రక్రియ ప్రారంభం కానుంది. వచ్చే నెల 15న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఉమ్మడి జిల్లా పరిధిలో వంశధార, తోటపల్లి మేజరు నీటిపారుదల ప్రాజెక్టులతో పాటు మడ్డువలస మధ్యతరహా ప్రాజెక్టులు ఉన్నాయి. వీటితోపాటు నారాయణపురం ఆనకట్ట చిన్నతరహా సాగునీటి ప్రాజెక్టులూ ఉన్నాయి. వీటి కింద లక్షలాది ఎకరాల ఆయకట్టు సాగులో ఉంది. సాగునీటిని ఉపయోగించుకుంటున్న రైతులతో నీటి వినియోగదారుల కమిటీలను ఏర్పాటు చేస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ప్రభుత్వం ఫిబ్రవరి 20, 2003లో జిఒ నంబరు 20 పేరుతో ఉత్తర్వులు

వెలువరించింది. గత ప్రభుత్వం ఈ జిఒలో కొన్ని అంశాలను సవరిస్తూ 2022, ఫిబ్రవరి తొమ్మిదో తేదీన ఉత్తర్వులు వెలువరించింది. ప్రస్తుతం జరుగనున్న ఎన్నికలు కొత్త సవరణలకు అనుగుణంగానే నిర్వహించున్నారు. జిఒను వైసిపి ప్రభుత్వం సవరించినా ఎన్నికలు మాత్రం నిర్వహించలేదు. టిడిపి హయాంలో 2015లో ఎన్నికలను నిర్వహించిన తర్వాత ఇప్పటివరకు నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు.

ఎన్నికల షెడ్యూల్ ఇలా...

సాగునీటిని వినియోగించుకుంటున్న రైతులను మూడు కేటగిరీలుగా విభజించారు. వాటిలో ప్రాజెక్టు కమిటీలు, డిస్ట్రిబ్యూటరీలు, నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయి. వీటికే ప్రస్తుతం ఎన్నికలు నిర్వహించనున్నారు. కొత్త జిల్లాల ప్రాతిపదికన ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈనెల 16న జిల్లా కలెక్టర్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. అదే రోజు నుంచి ఓటర్ల జాబితా సిద్ధం చేయనున్నారు. ఇందుకోసం రెవెన్యూ అధికారిని నియమించనున్నారు. ప్రాజెక్టులు, డిస్ట్రిబ్యూటరీలు, సాగునీటి వినియోగదారులకు సంబంధించి సంబంధిత నీటిపారుదలశాఖ అధికారులు 17 నుంచి 26వ తేదీ వరకు ప్రాదేశిక నియోజకవర్గాలను వర్గీకరణ ప్రక్రియ చేపట్టనున్నారు. 26న ప్రాదేశిక నియోజకవర్గాల జాబితాను ప్రచురించనున్నారు. జాబితాలపై 27, 28 తేదీల్లో అభ్యంతరాలను స్వీకరించనున్నారు. జాబితాలపై వచ్చిన అభ్యంతాలను 29న పరిష్కరించి అదే రోజు తుదిజాబితా వెలువరించనున్నారు.

వచ్చే నెల 15న ఎన్నికల నోటిఫికేషన్

డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు అక్టోబరు 30న నోటిఫికేషన్ వెలువడనుంది. నవంబరు ఒకటి నుంచి ఐదో తేదీ వరకు ఓటర్ల జాబితా రూపొందించనున్నారు. జాబితాలపై ఆరు, ఏడు తేదీల్లో అభ్యంతరాలను స్వీకరించనున్నారు. ఎనిమిదో తేదీన అభ్యంతరాలను పరిష్కరించి అదే రోజున తుది జాబితా వెలువరించనున్నారు. తొమ్మిది, పదో తేదీల్లో సబ్ కలెక్టర్, ఆర్‌డిఒ వద్ద అప్పీల్‌కు అవకాశం కల్పించారు. ఓటర్ల జాబితాపై నీటిపారుదలశాఖ కమిషనర్‌కు 13 నుంచి 15వ తేదీ వరకు అప్పీల్ చేసుకోవచ్చు. ప్రాజెక్టు కమిటీలకు, నీటి వినియోగదారుల సంఘాలకు నీటిపారుదలశాఖ కమిషనర్, డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు కలెక్టర్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువరించనున్నారు. నవంబరు 15న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.

కొవ్వాడ ఆర్ అండ్ ఆర్ పనులు వేగవంతం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కొవ్వాడ అణు విద్యుత్ ప్రాజెక్టు నిర్వాసితుల కోసం ఎచ్చెర్ల మండలం ధర్మవరం వద్ద నిర్మిస్తున్న ఆర్ అండ్ ఆర్ కాలనీలో అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌తో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అప్రోచ్ రోడ్డు పెండింగ్ పనులపై, నిర్వాసితులకు చెల్లించాల్సిన పెండింగ్ నష్ట పరిహారాలపై చర్చించారు. ప్రాజెక్టుకు అటవీశాఖ తరుపు నుంచి వస్తున్న అడ్డంకుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలను పరిష్కరించేందుకు నివేదికలు తయారు చేయాలని, ఉన్నతాధికారులకు నివేదించి సత్వర పరిష్కారాన్ని కనుగొనాలని స్పష్టం చేశారు. ధర్మవరంలో సకల సౌకర్యాలతో నిర్మిస్తున్న ఆర్ అండ్ ఆర్ కాలనీ పనుల స్థితిని ఆయన సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అటవీశాఖ నుంచి 213 ఎకరాల భూమిని పునరావాస కాలనీ నిర్మాణానికి తీసుకున్నామని అందులో ఒక్క రోడ్ల నిర్మాణాకే 62 ఎకరాలు, పార్కు అభివృద్ధికి 27 ఎకరాలు, పలు సౌకర్యాల కోసం మరో 29 ఎకరాల భూమిని కేటాయించామని తెలిపారు. సమావేశంలో శ్రీకాకుళం ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, జి-సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, కొవ్వాడ తహశీల్దార్ పి.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

దరఖాస్తుల వెల్లువ

- మద్యం దుకాణాలకు 2,879 అప్లికేషన్లు
- దరఖాస్తుల స్వీకరణ గడువు 11 వరకు పొడిగింపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మద్యం దుకాణాలకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. వరుసగా రెండు రోజులు 800 పైబడి దరఖాస్తులు వచ్చాయి. ఈనెల ఎనిమిదో తేదీన 880 దరఖాస్తులు రాగా, బుధవారం 812 వచ్చాయి. ఈనెల ఒకటో తేదీన నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ఇప్పటివరకు 2,897 దరఖాస్తులు వచ్చాయి. శ్రీకాకుళం మండలంలోని పలు దుకాణాలకు అత్యధికంగా వచ్చాయి. మండలంలో ఏర్పాటు కానున్న 17వ నంబరు దుకాణానికి అత్యధికంగా 47 దరఖాస్తులు అందాయి. ఇదే మండలంలోని 18వ నంబరు షాపునకు 41, 19వ నంబరు దుకాణానికి 39 దరఖాస్తులు చేరాయి. 15, 16 దుకాణాలకు 38 చొప్పున దరఖాస్తులు అందాయి. రణస్థలం మండలంలోని ఓ దుకాణానికి అత్యధికంగా 36 దరఖాస్తులు వచ్చాయి. బూర్జ మండలంలోని 41 నంబరు షాపునకు 35 దరఖాస్తులు, ఇచ్ఛాపురం మున్సిపాల్టీలోని ఒక షాపునకు 34 దరఖాస్తులు వచ్చాయి. కొత్తూరు, జి.సిగడాం మండలాల దుకాణాలకు చెరో 30 చొప్పున అప్లికేషన్లు చేరాయి.

టెక్కలి నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి చాలా తక్కువ దరఖాస్తులు వచ్చాయి. టెక్కలిలోని 98, 101 నంబర్ల దుకాణాలకు అత్యల్పంగా ఐదుగురేసి చొప్పున మాత్రమే దరఖాస్తు చేశారు. టెక్కలిలోని మూడు షాపులకు ఆరుగురు చొప్పున అప్లికేషన్లు అందించారు. దరఖాస్తుదారుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం అప్లికేషన్ల స్వీకరణను ఈనెల 11వ తేదీ వరకు పొడిగించింది. జిల్లాలో ఇప్పటికే దరఖాస్తుల సంఖ్య మూడు వేల మార్కును చేరుకుంది. ప్రభుత్వం గడువు పెంచడంతో నాలుగు వేల వరకు చేరవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

అన్న క్యాంటీన్‌లో నాణ్యమైన భోజనం

అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న కలెక్టర్, జెసి

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన అన్న క్యాంటీన్‌లో నాణ్యమైన భోజనం అందించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. నగరంలోని ఏడు రోడ్ల కూడలిలోని అన్న క్యాంటీన్‌ను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌తో కలిసి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన సమయంలో ఇద్దరు ఉన్నతాధికారులు అక్కడే స్వయంగా ప్లేట్లు పట్టుకొని సామాన్యుడిలా క్యూలైన్‌లో నిలబడి భోజనం చేశారు. భోజనం వేడిగా, రుచిగా ప్రజలకు అందించాలని సూచించారు. పేద ప్రజల కడుపు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ క్యాంటీన్లను నెలకొల్పి రూ.5కే నాణ్యమైన అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందజేస్తున్నట్లు చెప్పారు. క్యాంటీన్‌ను నిర్వహిస్తున్న అక్షయపాత్ర నిర్వాహకులకు కొన్ని సూచనలు చేశారు. క్యాంటీన్ ఆవరణలో పారిశుధ్య నిర్వహణ నిరంతరాయంగా ఉండాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వడ్డించేవారు, పాత్రలు, ప్లేట్లను శుభ్రం చేసేవారు ఒకేసారి రెండు పనులు చేయరాదని, ఎవరికి వారు కేటాయించిన విధుల్లో మాత్రమే ఉండాలని స్పష్టం చేశారు. అనంతరం క్యాంటీన్ ఆవరణలో భోజనం నాణ్యత, మంచినీరు, పరిశుభ్రత, ఇతర సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.

పోలీసు బందోబస్తు మధ్య మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్తున్న కుటుంబసభ్యులు

వనవిష్ణుపురంలో పోలీస్ పికెట్

- పోలీసు బందోబస్తు మధ్య వీరస్వామి అంత్యక్రియలు
- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబసభ్యులు

ప్రజాశక్తి - పోలాకి

మండలంలో బొద్దాం పంచాయతీ పరిధిలోని వనవిష్ణుపురం పూర్తిగా పోలీసులు అందులో ఉంది. బుధవారం గ్రామంలో సుమారు రెండు వందల మంది పోలీసులు, పది మంది ఎస్ఐలు, సిఐలు, ఎఎస్‌లులు పరయవేక్షిస్తున్నారు. ఇంటి నుంచి ఎవరినీ బయటకు రాకుండా నిలవరిస్తూ ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పికెట్ నిర్వహిస్తున్నారు. మంగళవారం సాయంత్రం వైసిపి, టిడిపి గ్రూపుల మధ్య పాతకక్షలు కారణంగా చెలరేగిన కొట్లాటలో టిడిపికి చెందిన పాలిన వీరాస్వామి (47) మృతి చెందగా, పాలిన రామారావుకు గాయాలైన విషయం విదితమే. క్షతగాత్రుడు నరసన్నపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతినికి భార్య పార్వతి, కుమారులు శంకర్, గనేష్, కుమార్తె జ్యోతి ఉన్నారు. మృతినికి పోస్టుమార్టం అనంతరం గ్రామంలో కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటుతో అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహంపై భార్య, పిల్లలు పడి బోరున విలపించారు. మృతుని కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామంలో ఇంకా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. వైసిపి నాయకులు పాలిన కృష్ణమూర్తితో పాటు మరికొందరిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని నరసన్నపేట సిఐ శ్రీనివాసరావు తెలిపారు.

ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ

ప్రజాశక్తి - మెళియాపుట్టి

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. మండల నలుమూలల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనిసమస్యలపై విన్నవించారు. పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, కాలనీలు, పట్టాదారు పాస్ పుస్తకాలు, సిఎం రిలీఫ్ ఫండ్, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని విన్నవించారు. అలాగే పెద్దలక్ష్మీపురానికి ఆర్‌టిసి బస్సు సౌకర్యం టెక్కలి నుంచి కల్పించాలని కోరారు. అలాగే చాపర, మెళియాపుట్టి గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. ఈ దర్బార్‌లో దాదాపు 1200 వరకు వినతులు వచ్చాయి. సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బడే పాపారావు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఎంఇఒ ఎస్.దేవేందరరావు, ఎస్.మోహనరావు, ఎ.రాజశేఖర్‌రెడ్డి, భాస్కరగౌడ, ఎస్.శరత్ కుమార్, పరమేశ్వర్‌రెడ్డి, చాపర మాధవరావు, దుక్క బాలరాజు పాల్గొన్నారు.

వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ప్రతిపాదనల సమాచారం తెలపాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆస్పత్రులకు సంబంధించి అప్‌గ్రేడేషన్ ప్రతిపాదనలు పంపినట్లు సంబంధిత సభ్యులకు తెలపాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వైద్యాధికారులను ఆదేశించారు. ఆగస్టు 28వ తేదీన నిర్వహించిన జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో బుధవారం సమీక్షించారు. ఆమదాలవలస, పాతపట్నం, టెక్కలి, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో ఆస్పత్రుల అప్‌గ్రేడేషన్‌పై కలెక్టర్ ఆరా తీశారు. ప్రతిపాదనలు పంపామని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి చెప్పగా, సంబంధిత శాసనసభ్యులకు సమాచారం తెలియజేస్తే ఫాలప్ చేస్తారని కలెక్టర్ తెలిపారు. డయాలసిస్ యూనిట్, అదనపు పడకల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు డిసిహెచ్‌సి చెప్పారు. వ్యవసాయశాఖపై సమీక్షలో ఎరువుల పంపిణీ, ఎంత ఎరువులు అవసరం ఉందని కలెక్టర్ అడగ్గా, 13 వేల మెట్రిక్ టన్నుల అవసరం ఉందని వ్యవసాయ అధికారులు తెలిపారు. నవంబర్ 15 నుంచి రబీ సీజన్ ప్రారంభమవుతుందని చెప్పారు. ఎరువులు రైతుసేవా కేంద్రాలు, డిసిఎంఎస్ తదితర వాటిలో ఇస్తున్నట్లు తెలిపారు. జలవనరుల శాఖలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలను కలెక్టర్‌కు జలవనరులశాఖ ఎస్ఇ వివరించారు. భామిని మండలంలో నష్ట పరిహారం కోసం ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపినట్లు డిటి చెప్పారు. పంచాయతీరాజ్ ఎస్ఇ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు, బల్క్ మిల్క్ సెంటర్లు పలు దశల్లో నిర్మాణంలో ఉన్నట్లు తెలిపారు. తులగాం ఆర్‌ఆర్ కాలనీని ఉపాధి హామీ నియమాల ప్రకారం గుర్తించాలని డ్వామా పీడీ సుధాకర్‌ను ఆదేశించారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలపై సమీక్షించారు. గిరిజన గ్రామాల్లో మేన్ డేస్ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గృహ నిర్మాణాలపై స్వయంగా వెళ్లి పరిశీలించాలన్నారు. విద్య, మైనర్ ఇరిగేషన్లపై సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో జిల్లాపరిషత్ సిఇఒ ఎల్.ఎన్.వి శ్రీధర్‌రాజా, గృహనిర్మాణశాఖ ఇన్‌ఛార్జి పీడీ జి.నగేష్, జలవనరుల శాఖ ఇఇలు రామచంద్రరావు, స్వర్ణకుమార్, డిఇ, ఎఇలు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

దసరాకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

దసరా పండగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఈనెల తొమ్మిదో తేదీ నుంచి పలు ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి విజయ్ కుమార్ తెలిపారు. విశాఖ నుంచి పలాస వైపు ప్రతి పావుగంట, విశాఖ నుంచి ఇచ్ఛాపురానికి ప్రతి 20 నిమిషాలకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. 9వ తేదీన ప్రత్యేకంగా 60 బస్సులు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. పగటి పూట ఐదు నిమిషాలకు ఒక బస్సు విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం జిల్లాకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రాత్రి తొమ్మిది గంటల తర్వాత ప్రతి గంటలకూ పలాస, ఇచ్ఛాపురం వైపు బస్సులు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. రద్దీని బట్టి అదనపు సర్వీసులు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. రైళ్ల నుంచి వచ్చే ప్రయాణికులు విశాఖ బస్టాండ్‌కు చేరగానే అక్కడ ఉండే జిలా అధికారులు పది నుంచి 15 బస్సులను రద్దీని బట్టి ఏర్పాటు చేస్తారని తెలిపారు. ప్రస్తుతం జిల్లా నుంచి విజయవాడకు ఏడు, రాజమండ్రికి ఆరు, అమలాపురం, రామచంద్రాపురానికి రెండేసి, భద్రాచలం, కొవ్వూరు, రావులపాలెం, రాజోలుకు ఒక్కొక్కటి చొప్పున బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. రద్దీని బట్టి అదనపు సర్వీసులు పెంచుతామని పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి పదో తేదీన శ్రీకాకుళం, పలాసకు ఒక్కో బస్సు, 11న శ్రీకాకుళం, టెక్కలికి నడపనున్నట్లు తెలిపారు. దూరప్రాంతాలకు ప్రయాణికులు రెండువైపులా ఒకేసారి టిక్కెట్లు కొనుగోలు చేస్తే పది శాతం రాయితీ పొందే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. ఎటువంటి అదనపు ఛార్జీలు లేకుండా సాధారణ ఛార్జీలతోనే ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్లు స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాగావళి తీరంలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలి

అధికారులకు ఎమ్మెల్యే శంకర్ ఆదేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నాగావళి నది పరివాహక ప్రాంతాల్లో జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అధికారులను ఆదేశించారు. స్థానిక మంగువారితోట సమీపంలో నదికి వెళ్లే మార్గాలను బుధవారం పరిశీలించారు. నదికి ఆనుకుని దట్టమైన పొదలు, చెట్లు ఉండడంతో కొందరు ఆకతాయిలు అక్కడకు చేరి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని చెప్పారు. సాయంత్రం వేళ కొందరు యువత ఈ ప్రాంతాలకు చేరి గంజాయి, మద్యం సేవిస్తున్నట్లు తనకు ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. మంగువారితోటలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంచినీటి సదుపాయం సక్రమంగా జరుగుతున్నదీ, లేనిదీ ఆరా తీశారు. అలాగే పారిశుధ్య సిబ్బంది కాలనీల్లోకి ప్రతిరోజూ వస్తున్నారా...? కాలువలను శుభ్రం చేస్తున్నారా అని ప్రజలకు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం కావడంతో దోమలు వ్యాప్తి చెందకుండా కాలువల్లో దోమల మందు పిచికారీ చేయాలని ఎంహెచ్ఒ పి.సుధీర్‌కుమార్‌కు సూచించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ ఏ సమస్య ఉన్నా తనను నేరుగా కలవచ్చునని భరోసానిచ్చారు.

తురాయిచెట్టు వీధి కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

గంజాయి నియంత్రణకు కఠిన చర్యలు

- పేకాట స్థావరాలపై ప్రత్యేక నిఘా
- బాణసంచా గోదాముల్లో భద్రతా ప్రమాణాలను పర్యవేక్షించాలి
- విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి

ప్రజాశక్తి - విశాఖపట్నం

గంజాయి అక్రమ రవాణా, నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలని విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి ఆదేశించారు. విశాఖ రేంజ్ పరిధిలోని అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎస్‌పిలతో బుధవారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేంజ్ పరిధిలో ఎక్కడా గంజాయి సాగు కాకుండా చూడాలని, గంజాయి పండించే రైతులు తమ జీవనోపాధికి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. గంజాయి సాగు, విక్రయాలు, రవాణా, వినియోగం వల్ల విధించే శిక్షలు, ఎదుర్కొనే న్యాయపరమైన చిక్కులను రైతులకు వివరించాలన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రజలు, విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు 'సంకల్పం' కార్యక్రమం ద్వారా అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు మరింత పటిష్ఠంగా డైనమిక్ వాహన తనిఖీలను ఆకస్మికంగా చేపట్టాలన్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద వాహన తనిఖీలను కుణ్ణంగా చేపట్టాలని, ఆధునిక సాంకేతికతను, స్నిఫర్ డాగ్స్ ఇప్పటికే గుర్తించిన హాట్ స్పాట్ల వద్ద తనిఖీలు చేపట్టాలన్నారు. గంజాయి అక్రమ రవాణాకు తరచూ పాల్పడే వారిపై పీడీ యాక్టును ప్రయోగించాలన్నారు. గంజాయి కేసుల్లో పరారీలో ఉన్న నిందితులను అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వారిని అరెస్టు చేయాలని ఆదేశించారు.

మాట్లాడుతున్న విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి

బాణసంచా గోదాముల్లో భద్రతా ప్రమాణాలను పర్యవేక్షించాలి

దీపావళి వస్తున్న నేపథ్యంలో బాణసంచా విక్రయించే షాపులు, గోడౌన్లను తనిఖీ చేసి, వారి లైసెన్సులు తనిఖీ చేయాలని, భద్రతా ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అనధికారికంగా బాణసంచా విక్రయాలు జరగకుండా చూడాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. బాణసంచా షాపులు, గోడౌన్ల వద్ద ఎటువంటి ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను డిఐజి ఆదేశించారు. పేకాట స్థావరాలను గుర్తించేందుకు నిఘా పెట్టాలని, జిల్లాల్లో ఎక్కడా జూదం, క్రికెట్ బెట్టింగు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నేరాలను నియంత్రించడంలో భాగంగా ప్రతి జిల్లాలో క్రైమ్ ప్రోన్ ఏరియాలను గుర్తించి, సిసి కెమెరాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ఏ తరహా నేరం జరిగినా సిసి కెమెరాల్లో నేరానికి సంబంధించిన వీడియోలు నిక్షిప్తమయ్యే విధంగా చర్యలు చేపట్టాలని, అందుకు అవసరమైన సిసి కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలను సిద్ధం చేసి పంపాలన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన

సైబర్ నేరాలను నియంత్రించడంలో భాగంగా ప్రజలకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలన్నారు. డిజిటల్ అరెస్టు పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. సైబర్ మోసానికి గురైతే 1930కు ఫిర్యాదు చేసే విధంగా చూడాలని, గతంలో నమోదైన సైబర్ కేసుల్లో బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ అయిన నగదు బాధితులకు తిరిగి చేరే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. దర్యాప్తులో ఉన్న హత్య కేసులు, లాంగ్ పెండింగు కేసులు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు సంబంధించి నమోదైన రేప్, వరకట్న మరణాలు, పోక్సో కేసులను రేంజ్ డిఐజి సమీక్షించి, దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. నిందితులు న్యాయస్థానాల్లో శిక్షింపబడే విధంగా సాక్ష్యాలను, సాంకేతిక ఆధారాలను సేకరించే విధంగా దర్యాప్తు అధికారులు చర్యలు చేపట్టే విధంగా చూడాలని ఆదేశించారు. బాలికలు, బాలుర అదృశ్యం కేసుల్లో అలసత్వం వహించకుండా, కేసు నమోదైన వెంటనే వారిని అచూకీ కనిపెట్టేందుకు ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో అనకాపల్లి, అల్లూరి, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం జిల్లాల ఎస్‌పిలు ఎం.దీపిక, అమిత్ బర్దార్, వకుల్ జిందాల్, కె.వి మహేశ్వర రెడ్డి, ఎస్.వి మాధవ్ రెడ్డి పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

భవన అక్రమ నిర్మాణదారులకు నోటీసులు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- పలాస
పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా అక్రమంగా భారీ భవంతులు నిర్మాణాల జోరుగా సాగుతున్నాయి. దీనిపై ఈ నెల 3న 'ప్రజాశక్తి'లో 'యథేచ్ఛగా భారీ వంతులు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై కమిషనర్ టి. రామారావు స్పందించారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా నిర్మాణం చేపడుతున్న భవనాలకు పరిశీలించారు. భవన యాజమానులకు మెదటి, రెండో విడతలు నోటీసులు జారీ చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న భారీ భవనాలను పరిశీలించామన్నారు. ఇప్పటికే గతంలో ఒకసారి నోటీసులు జారీ చేశామని, రెండోసారి కూడా నోటీసులు జారీ చేస్తామని అన్నారు. అనంతరం కోర్టులో భవన నిర్మాణాలపై ఛార్జ్‌షీటు వేశామన్నారు. టౌన్ ప్లానింగ్ నిబంధనలకు మేరకు భవన నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఆక్రమించిన వారిపై కఠినంగానే వ్యవహరిస్తామన్నారు. ఆయనతో పాటు టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

'ఐతమ్'లో ఎన్‌సిసిలకు శిక్షణ

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో బెటాలియన్ శ్రీకాకుళం ఎన్‌సిసి కమెండింగ్ ఆఫీసర్ కల్నల్ కేదార్నాద్ సాహు, ఆడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కల్నల్ ప్రసూన్ కుమార్ పండా ఆధ్వర్యాన ఎన్‌సిసి వార్షిక శిక్షణ బుధవారం నిర్వహించామని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ప్రత్యేక క్యాంప్లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన 32 విద్యా సంస్థల నుంచి 500 మంది ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారని పేర్కొన్నారు. ఈ శిక్షణా కాలంలో వ్యక్తిగత ఆరోగ్యం, పరిశుభ్రత, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, రోడ్డు భద్రత, మాదక ద్రవ్యాల నిషేధం, ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన, ప్రాణరక్షణ మార్గాలు, పర్వతారోహన, గ్రామాల్లో స్వచ్ఛ భారత్ నిర్వహించడం, అగ్నివీర్ ఉద్యోగాల్లో చేరుందుకు ఆసక్తి ఉన్న 40 మందిని ఎంపిక చేసి ప్రత్యేక తర్ఫీదు ఇవ్వడం, చిత్తడి నేలల పరిరక్షణ, తుపాకీలు పేల్చుట (ఫైరింగ్) వంటి అంశాలపై నిపుణుల ద్వారా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. వీటితో పాటు రోజూ రైఫిల్ డ్రిల్, యోగా, వ్యాయామం, క్రీడలపై సైతం శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ ప్రత్యేక క్యాంపుకు పర్యవేక్షకులుగా 14వ ఆంధ్రా బెటాలియన్ కల్నల్లతో పాటు క్యాంప్ కమేండింట్ మేజర్ వి.మహేష, అడ్యుటెంట్ కెప్టెన్ డాక్టర్ వై.పోలినాయుడు, ఐతమ్ ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ టి.మురళీమోహన్‌లు వ్యవహరిస్తున్నారని తెలిపారు.

శిక్షణ పొందుతున్న ఎన్‌సిసి క్యాడెట్లు

సస్యరక్షణతో పంటల దిగుబడులు

ప్రజాశక్తి సోంపేట
గ్రామాల్లో నిర్వహిస్తున్న పొలంపిలుస్తోంది కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ ఎడి కె.త్రినాథస్వామి, వ్యవసాయశాఖ ఎడిఎ కె.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని బారువ, గొల్లగండి గ్రామాల్లో ఎం బి.నరసింహరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆపల్గొని మాట్లాడారు. చేతికొస్తున్న పంటను అడవిపందులు నాశనం చేస్తున్నయని రైతులు వారి దృష్టికి తీసుకెళ్లారు. ఎఒ మాట్లాడుతూ సోలార్ ఫెన్సింగ్ మొక్కల నాటుకుని వాటి నుంచి రక్షణ పొందవచ్చని సూచించారు.
ఆమదాలవలస : సస్య రక్షణ చర్యలతో వరి పంటలో దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు తెలిపారు. బుధవారం మండలంలోని పెద్ద జొన్నవలస, గాజుల కొల్లివలసలో పోలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు పంటల యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్యం, పంటల్లో వచ్చే చీడ, పీడలు, తెగుళ్ల ఏవిధంగా ఎదుర్కోవాలనే అంశాలపై వివరించారు. వరి పొలంలో కుళ్ల తెగులును గుర్తించి దాని నివారణకు హెక్సకోనాజోల్ రెండు ఎంఎల్ లీటరు నీటికి పిచికారి చేయాలని సూచించారు. ఆకుముడత నివారణకు 300 గ్రాములు ఎకరాకు, తెల్లదోమ నివారణకు బూప్రోజిన్ 320 మీ.లీ ఎకరాకు పిచకారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్, రైతులు పాల్గొన్నారు.
పలాస : ఖరీఫ్ వ్యవసాయసాగులో మెరుగైన యాజమాన్య పద్ధతుల ద్వారానే అధిక దిగుబడులు సాధ్యమవుతుందని టిడిపి నాయకులు, గ్రంథాలయ మాజీ చైర్మన్ పీరుకట్ల విఠల్ అన్నారు. మండలంలోని పెదంచల రైతు సేవా కేంద్రంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోందిలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతాంగానికి అధిక దిగుబడులు అందించడానికి, మెరుగైన యాజమాన్య పద్ధతులు, సాగు విధానం వంటివి రైతులు తెలియజేయడానికి పొలంపిలుస్తోంది ముఖ్య ఉద్దేశమని అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రాయితీపై విత్తనాలు అందించడం. గ్రామస్థాయిలో విత్తనోత్పత్తి చేపట్టడం, వ్యవసాయ యాంత్రీకరణ. సేంద్రీయ వ్యవసాయం, శాస్త్రీయ పద్ధతుల్లో చేపట్టడం వంటి అంశాలపై రైతులు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఎడి ఎల్.మధు, పలాస మండల వ్యవసాయాధికారి కె.పోలారావు, ఎఇఒ శారద, జిల్లా శాస్త్రవేత్త అనూష, పెదంచల సర్పంచ్ వరిశ రామారావు, ఉప సర్పంచ్ కొర్ల బాలకృష్ణ, సచివాయల హారీకల్చర్ అసిస్టెంట్ తెంబూరు ఝాన్సీరాణి పాల్గొన్నారు.
కోటబొమ్మాళి: ప్రస్తుత వరి సాగుకు సోకిన పాముపోడ తెగులకు నివారణకు హెక్సాకోనజోల్ మందు ఒక లీటర్ నీరులో 2 మిల్లీలీటర్ కలిపి పిచకారీ చేయాలని మండల ఎఒ ఎస్.గోవిందరావు తెలిపారు. మండలంలోని పెద్దబమ్మిడి పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శిమ్మ నారాయణరావు పాల్గొన్నారు.
వజ్రపుకొత్తూరు : ప్రస్తుత వాతావరణ పరిస్థితులు వరిలో దోమపోటు వ్యాప్తికి అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం కీటక నాశని శాస్త్రవేత్త డాక్టర్ అనూష అన్నారు. మండలంలోని నగరంపల్లిలో పలాస వ్యవసాయ ఎడి ఎల్.వి.మధు అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంట పొలాలను పరిశీలించి దోమపోటు సోకినట్లు గుర్తించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతు శిక్షణ కేంద్రం ఎడి వెంకటరావు, ఎఒ పి.కురణ్‌వాణి, ఎఇఒ ఎం.జ్యోత్స్న, విఎఎ శ్రీలేఖపావని, అపర్ణ, ఎంపిటిసి ప్రతినిధి బమ్మిడి మోహనరావు, మాజీ సర్పంచ్ దువ్వాడ జయరాం చౌదరి, సనపల చక్రవర్తి, బమ్మిడి లక్ష్మీపతి, బగాది చల్లయ్య, బి.రామయ్య, దువ్వాడ అప్పారావు, బమ్మిడి కురమయ్య, ఎస్.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.
మెళియాపుట్టి : మండలంలోని కోసమల, వసుంధర గ్రామాల్లో ఎఒ దానకర్ణుడు పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు లక్ష్మణరావు, శంకరరావు, సుబ్బారావు, వెంకటరావు, ఎంపిటిసి చిట్టిబాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు యమున పాల్గొన్నారు.
పోలాకి: రైతులు వ్యవసాయ రంగంలో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త భాగ్యలక్ష్మి సూచించారు. మండలంలోని డి.ఎల్.పురంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డోల ప్రసాదరావు, ఎడిఎ రవీంద్ర భారతి, ఎఒ చిరంజీవి పాల్గొన్నారు.

సోంపేట : అవగాహన కల్పిస్తున్న జెడి త్రినాథస్వామి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్ : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని 44వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి కవ్వాడి సుశీల అన్నారు. హయాతినగరం రెల్లివీధిలో బుధవారం నగరపాలక సంస్థ ఆధ్వర్యాన ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ ప్రాంతంలో విషజ్వరాలు ప్రబలుతున్నట్టు గుర్తించిన నగర పాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు ఆదేశాల మేరకు మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఆశ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి జ్వరాలపై సర్వే నిర్వహించారు. ఈ శిబిరంలో హెల్త్ సెక్రటరీ ప్రమీల హాజరై స్థానికంగా నివాస ప్రాంతాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతిరోజూ కాచి వడబోసిన నీటినే తాగాలని సూచించారు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు కాకుండా వేడివేడిగా ఉన్న వాటినే తినాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు తలెత్తితే ఆలస్యం చేయకుండా తక్షణమే వైద్యులను సంప్రదించాలన్నారు. వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, ఆశ కార్యకర్త తులసీ తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

ధాన్యం కొనుగోలుకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి- కొత్తూరు
రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు సిద్ధం కావాలని టెక్కలి ఆర్‌డి ఎం.కృష్ణమూర్తి మిలర్లకు సూచించారు. మండలంలోని నివగాం, కంచాలపేట రైస్ మిల్లులను బుధవారం పరిశీలించారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేయనున్న ఇసుక ర్యాంపును పరిశీలించారు. అంతకుముందు పారాపురం రెవెన్యూ పరిధిలోని ఈ-క్రాప్ పంట పొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండాలన్నారు. ఈయనతో పాటు తహశీల్దార్ రవిచంద్ర, సిఎస్‌డిటి టి.భీమారావు, ఎంపిడిఒ స్వర్ణలత, ఎన్.శ్రీనివాస్, పూర్ణిమ, సర్వేయర్ ఎ.తిరుపతిరావు, నారాయణ, తోట సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

తహశీల్దార్ బాధ్యతల స్వీకరణ

వజ్రపుకొత్తూరు: మండల తహశీల్దార్‌గా డి.సీతారామయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. పార్వతీపురం మన్యం జిల్లా నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన పి.బాల బదిలీపై వెళ్లిపోయారు. నూతన తహశీల్దార్‌కు విఆర్‌ఒల మండల సంఘం నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

ఎరువుల కొరతపై సభ్యుల ధ్వజం

ప్రజాశక్తి- నందిగాం
స్థానిక మండల ప్రజా పరషత్ సమావేశ మందిరంలో ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అధ్యక్షతన బుధవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎరువుల కొరతపై ప్రశ్నల వర్షం కురిపించారు. సభ్యులు తమరి రాజు మోహనరావు సకాలంలో రైతులకు ఎరువులు అందగా ఇబ్బందులు పడ్డారని సభల దృష్టికి తీసుకెళ్లారు. మండల ఎఒ పి.శ్రీకాంత్‌వర్మ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం 50 శాతం ప్రతి రైతుకూ అందించినట్లు తెలిపారు. గృహ నిర్మాణశాఖ అధికారి శంకర్ మాట్లాడుతూ 2014-19లో 1550 ఇళ్లకు బిల్లు మంజూరు కాగా, అన్నీ శ్లాబ్ లెవల్‌లో ఉన్నాయని తెలిపారు.
అలాగే 2019-24లో 2050 ఇళ్లు మంజూరు కాగా, అందులో ప్రస్తుతం 168లో ఉండగా, 145 శ్లాబ్ వేసేందుకు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. 1069 శ్లాబులు వేశామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ టి.రాజారావు, మండల ప్రత్యేక ఆహ్వానితులు జోగారావు, ఎర్ర చక్రవర్తి, బాలరాజు, ఎపిఎం మనోరత్నం, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మధు, ఎపిఒ నాగరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు
మండలంలోని పూడిజగన్నాథపురం పంచాయతీ తిమ్మలవానిపేటకు చెందిన దుమ్ము లచ్చయ్య (75) అనారోగ్య సమస్యల కారణంగా బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లచ్చయ్య ఉద్దానంలో జీడి, కొబ్బరి తోట పనులు చేసుకుంటూ జీవిస్తుండేవాడు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో గతంలో ఒక సారి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అప్పటి నుంచి కొంత మతిస్థిమితం లేకుండా ఉండడం, ఆర్థిక సమస్యలు వెంటాడడం వంటి కారణాలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య రాజమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేమాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి.నిహార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

సోహిత్ కోట మృతదేహం

పాతపట్నం : పాతపట్నం పట్టణానికి చెందిన సోహిత్ కోట (22) అనే విద్యార్థి రోడ్డు ప్రమాదంలో బుధవారం మృతి చెందారు. పట్టణానికి చెందిన సోహిత్ కోట, రాహుల్ అనే విద్యార్థులు ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడిలో సెంచరీ యూనివర్సిటీలో బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. బుధవారం పాతపట్నం నుంచి కాలేజీకి వెళ్తుండగా... పాటికోట సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో సోహిత్ కోట అక్కడికక్కడే మృతి చెందాడు. రాహుల్‌కు గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని స్థానికులు స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఒడిశా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుతో యువకుడు మృతి

కొత్తూరు: మండలంలోని వసపకు చెందిన కొయిలపు తేజేశ్వరరావు (34) పాముకాటుతో మృతి చెందాడు. బుధవారం పశువులకు పచ్చగడ్డి కోసం పొలానికి వెళుండగా పాము కాటు వేసింది. కర్రపుల్ల గీసింది అనుకొని తన పని తను చేసుకుని ఇంటి బాట పట్టాడు. మెయిన్ రోడ్ చేరుకొని పక్కనే ఉన్న బిర్యాని సెంటర్ వద్ద కూర్చొని కళ్లు తిరుగుతున్నాయని నీటిని తాగాడు. అనంతరం అక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే స్థానికులు ఆటో ద్వారా కొత్తూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు జోసఫ్ వైద్య సేవలు అందించారు. పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య శైలజ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు హెచ్‌సి కోటేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గంజాయి స్వాధీనం

పలాస : పలాస రైల్వేస్టేషన్ వద్ద ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఒడిశాకు చెందిన ఇద్దరిని అరెస్టు చేశామని కాశీబుగ్గ సిఐ డి.మోహనరావు బుధవారం తెలిపారు. ఒడిశా రాష్ట్రం కందమల్ జిల్లా పిరింగియా బ్లాక్ లైసింగ్‌కు చెందిన సాగర్ మాలిక్, అదే జిల్లా పుల్వానీ బ్లాక్‌కు చెందిన రుబీ పిడియాకు చెందిన దండువా కోహార్ అనే ఇద్దరు ఒరిశాకు చెందిన నిందితులు బరంపురం నుంచి పలాస వరకు గంజాయితో చేరుకున్నారని అన్నారు. బెంగుళూరులో విక్రయించడానికి పలాసలో రైలు ఎక్కడాన్ని పోలీసులు గుర్తించారని అన్నారు. వారి వద్ద నుంచి ఐదు కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. రెవెన్యూ, పలాస జీఆర్‌పి పోలీసులు, కాశీబుగ్గ పోలీసులు సంయుక్తంగా గంజాయిని తూకం వేసి వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జవాను అంత్యక్రియలు

నందిగాం : మండల కేంద్రం చింతకుంట వీధి కాలనీకి చెందిన గంట జగదీశ్వరరావు (37) అనే ఎస్-ఎస్‌బి జవాన్ అంత్యక్రియలు బుధవారం నిర్వహించారు. జగదీశ్వరరావు 14 ఏళ్ల క్రితం ఎస్-ఎస్‌బిలో జవాన్‌గా ఎంపికయ్యాడు. సహస్ర సీమా బాల్ 48వ బెటాలియన్ బీహార్‌లోనే జయనగర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. దసరా సెలవులకు ఇంటికి రావాలనే ఉద్దేశంతో ఆదివారం బీహార్‌లో బయలుదేరారు. అదే రోజు హౌరాలో రైల్వే స్టేషన్‌లో దిగి ఫలక్‌నామ ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. దోర్నీ స్టేషన్ సమీపంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వచ్చి రైలు నుంచి కిందకు జారిపడి మృత్యువాత పడ్డాడు. పోలీసులు ఐడీ కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసి బుధవారం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పురవీధుల్లో మృతదేహాన్ని ఊరేగించి శ్మశాన వాటికలో విశాఖపట్నం చెందిన ఎఆర్ పోలీసులు వందనాలతో దహన సంస్కారాలు నిర్వహించారు.

మృతదేహాన్ని తీసుకెళ్తున్న కాలనీవాసులు

ఆలయ అభివృద్ధికి సహకరించాలి

ఎమ్మెల్యే అశోక్‌కు వినతిపత్రం అందిస్తున్న కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం
ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎమ్మెల్యే అశోక్‌ను కోరారు. స్థానిక స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయాన్ని ఎమ్మెల్యే అశోక్ బుధవారం దర్శించారు. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కాళ్ల జయదేవ్, నందికా జాని, లీలారాణి, కె.శంకర్ రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కవిటి: సమగ్ర శిక్షా అభియాన్ పరిధిలో పనిచేస్తున్న వైద్య, వ్యాయామ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మను అవుట్ సోర్సింగ్ వ్యాయామ ఉపాధ్యాయుడు బల్లెడ రమేష్ కోరారు. ఈ మేరకు కవిటి పర్యటనకు వచ్చేసిన ఎమ్మెల్సీని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతినెలా ఒకటో తేదీకే తమకు జీతం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాత్కాలిక ఉద్యోగం నుంచి శాశ్వత ఉద్యోగం ఉద్యోగులుగా పరిగణించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా గత 12 ఏళ్లుగా పనిచేస్తున్న దృష్ట్యా రాబోయే డిఎస్‌సిలో ప్రస్తుతం తాత్కాలిక పద్ధతిలో వ్యాయామ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న పాఠశాలలు మినహాయించి నోటిఫికేషన్ జారీ చేసేలా సహకరించాలని కోరారు. ఈ క్రమంలో కవిటి మండలం బొరివంకలో ఉపాధ్యాయ సంఘాలను కలిసిన రాబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సహకరించాలని కోరారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు.

వినతిపత్రం అందజేస్తున్న రమేష్

సచివాలయానికి గ్రామస్తుల తాళం

ఇఒపిఆర్‌డితో మాట్లాడుతున్న గ్రామస్తులు

సోంపేట: మండలంలోని జింకభద్ర గ్రామ పంచాయతీలో గత ఐదేళ్లలో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని మహిళలు కోరారు. ఈ మేరకు సచివాలయం వద్ద బుధవారం ఆందోళన చేపట్టి సిబ్బందిని బయటకు పంపించి కార్యాలయానికి తాళం వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో అక్రమంగా ప్రభుత్వ భూములను ఆక్రమించారని, నిధులు దారి మళ్లించా రని ఆరోపించారు. దీనిపై పంచాయతీ ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. పంచాయతీ పరిధిలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించడం లేదన్నారు.
ఈనెల 14 లోగా రెవెన్యూ సమస్యలు పరిష్కరించకుంటే తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఇఒపిఆర్‌డి వెంకటేశ్వరరావు స్పందించి గ్రామస్తులతో మాట్లాడారు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు వెనుతిరిగారు. ఆందోళనలో పురుషోత్తం, టి.శ్రీనివాసరావు, ఎన్.వెంకటరావు, బి.భద్రమ్మ, పోకల గిరి, తామర కుమార్, టెంక తేజేశ్వరరావు, మడ్డు బుద్దేశ్, పుచ్చల కృష్ణారావు పాల్గొన్నారు.

అరుదైన శస్త్రచికిత్స విజయవంతం

ఇచ్ఛాపురం: వికేఆర్ ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యాన (మునుకు) రీప్లేస్మెంట్ ఆపరేషన్ విజయవంతమైంది. చిన్న మేధర వీధికి చెందిన వికెఆర్ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వెచ్చ సంతోష్ బుధవారం 65 ఏళ్ల అనే వృద్ధుడికి ఆపరేషన్ చేశారు. కేర్ ఆస్పత్రికి చెందిన ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ శ్రీనివాస్ సహకారంతో ఈదుపురానికి చెందిన జుత్తు లింగయ్యకు ఆపరేషన్ చేశారు. వంకరగా ఉన్న కాలు, 15 సెంటీమీటర్లు వరకు పొట్టిగా ఉన్న కాలు భాగాన్ని సరిచేసి మునుకు భాగంలో రీప్లేస్మెంట్ చేసినట్లు చెప్పారు. విశాఖ, హైదరాబాద్, బెంగళూరు వంటి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మాత్రమే జరిగే ఈ అరుదైన ఖరీదైన సర్జరీని స్థానికంగానే విజయవంతంగా పూర్తి చేసినట్లు చెప్పారు.



డాక్టర్ సంతోష్‌తో లింగయ్య

ఘనంగా దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్
దసరా ఉత్సవాల్లో భాగంగా నగరంలోని ఆలయాల్లో సందడిగా కనిపిస్తున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయాల్లో యాత్రికులు పెద్దసంఖ్యలో హాజరై ఆటపాటలతో కనువిందు చేస్తున్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో సంప్రదాయ వెడ్డింగ్ ఈవెంట్స్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన దేవీ మండపం అలంకరణ చూపరులను ఆకట్టుకుంటుంది. ఏడురోడ్ల కూడలిలో ఉన్న విజయదుర్గ, రామలక్ష్మణ కూడలి వద్ద దుర్గా మహాలక్ష్మి, కిన్నెర జంక్షన్‌లో ఉన్న ముత్యాలమ్మ, కళింగ రోడ్డులో ఉన్న నీలమ్మ తల్లి, నాగావళి తీరాన ఉన్న వారాహీ దేవి, గాయత్రి, పాత శ్రీకాకుళంలో ఉన్న సంతోషిమాత ఆలయం, సీపన్నాయుడి పేటలో ఉన్న దుర్గా దేవీ ఆలయం, బలగలో ఉన్న భద్రమ్మ తల్లి ఆలయంలో దేవీ నవరాత్రులు ఘనంగా కొన సాగుతున్నాయి. కార్యక్రమంలో గురువులు రవి, శివ, బంగారి, రాజేష్ రెడ్డి, తరుణ్ సాయిరెడ్డి, గణేష్ రెడ్డి, ధనలక్ష్మి, ఆమని తదితరులు పాల్గొన్నారు.
కోటబొమ్మాళి: ముప్పై ఏళ్ల క్రితం పాఠశాల ఉపాధ్యాయులు పిల్లలతో కలిసి బాణాలతో పువ్వులు విసిరి దసరా పాటలతో వీధుల్లో తిరిగితే... గ్రామస్తులు పిల్లలను తమ ఇంటివద్దకు పిలిపించుకొని దసరా పాటలు పాడించుకునేవారు. అనంతరం పిల్లలకు ఫలహారాలు, కానుకలు ఇచ్చేవారు. కానీ, ప్రస్తుత ఆధునిక కృత్రిమ మేధ, సెల్ ఫోన్ల యుగంలో పాత సంస్కృతి సంప్రదాయాలు మరుగున పడిపోయాయి. కొత్తమ్మతల్లి జెడ్‌పిహెచ్‌ఎస్‌కి చెందిన పిల్లలు సరస్వతీ పూజ అనంతరం ప్రస్తుత ఆధునికతను దసరా పాటలకు జోడిస్తూ సామాజిక చైతన్యం కలిగించేలా సీతమ్మవాకిట్లో, సిరిమల్లె చెట్టు, మాయమైపోయాడు మనగాంది తాత, కొత్తపల్లిలోన బాగోతలాట, సారాలు తాగొద్దు... ఖైనీలు వద్దు, చెప్పవే చెల్లమ్మ మన అమ్మకు, ఏమిరా కృష్ణయ్య ఇంత ఆగడము అంటూ 16 రకాల పాటలను వీధులలో వేషధారణలో తిరిగి పూలతో బాణాలు వేసి ఆకట్టుకున్నారు. చిన్నారులను మెచ్చి ఇచ్చిన మిఠాయిలు, పప్పు బెల్లాలు, కానుకలను తాము సంగీతం, క్రీడా సామగ్రి కొనుగోలు చేస్తామని విద్యార్థి నాయకులు దుర్గాప్రసాద్, కవిత, శిరీషలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోవిందరావు, ఉపాధ్యాయులు షణ్ముఖరావు, గోపి, రాము, అప్పలనాయుడు పాల్గొన్నారు.
లావేరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులతో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తొలుత సరస్వతి దేవి స్తోత్రం ప్రారంభించారు. గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇదే గ్రంథాలయంలో చదువుకుని సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.లక్ష్మణరావు సుమారు 80 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : బాణాలు వేస్తున్న విద్యార్థులు

'ఆరోగ్యవరం' ఆస్పత్రికి ఎల్‌ఐసి అంబులెన్స్

నమూనా తాళాన్ని అందజేస్తున్న శారదప్రసాద్ దాస్

సోంపేట : సుదీర్ఘ కాలం పాటు సోంపేట పరిసర ప్రాంత వాసులకు నేత్ర వైద్య సేవలు అందిస్తున్న ఆరోగ్యవరం నేత్రాస్పత్రికి ఎల్‌ఐసి కంపెనీ గోల్డెన్ జూబ్లీ పురస్కరించుకొని సామాజిక సేవలో భాగంగా రూ.21 లక్షల విలువచేసే అంబులెన్స్‌ను బహుకరించారు. ఎల్‌ఐసి సీనియర్ డివిజన్ మేనేజర్ శారద ప్రసాద్ దాస్ అంబులెన్స్ నమూనా తాళాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గ్రేసీకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యవరం నేత్రాస్పత్రి నిరుపేదలకు అందిస్తున్న సేవల్లో తమ వంతు భాగస్వామ్యం కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అలాగే సాలూరు లెప్రసీ మిషన్‌కు, విశాఖపట్నంలో శంకర్ ఫౌండేషన్‌కు అవసరమైన పరికరాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలాసకు చెందిన ఎల్‌ఐసి చీఫ్ మేనేజర్ టి.బీసోయ్, సేల్స్ మేనేజర్ రవికిరణ్, ఇచ్ఛాపురం, సోంపేట బ్రాంచ్ మేనేజర్లు శ్రీరామ్ ప్రసాద్ వెంకటేష్, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ అధికారి బుచ్చన్న, డాక్టర్ రామారావు పాల్గొన్నారు.

ముగ్గులు వేసిన మహిళలు

రణస్థలంలో ముగ్గుల పోటీలు

రణస్థలం: దసరా శరన్నవరాత్రుల సందర్భంగా రణస్థలం మండల కేంద్రంలో మంగళవారం రాత్రి నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి జి.లత, రెండో బహుమతి యు.సావిత్రి, మూడో బహుమతి ఎం.నీలిమ, కన్సలేషన్ బహుమతులు సాయిహసిని, మాధురి, రమా, దివ్య, గౌరి, శ్రీహిత, జయశ్రీ, సాయిలత, లలిత తదితరులకు అందించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మహిళలు ఉదయం పూట ఇళ్ల ముందు ముగ్గులు వేయడం మంచి వ్యాయామమన్నారు. దీంతో పాటు మహిళల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. ముగ్గుల పోటీలు ఐక్యతకు, ఆప్యాయతకు నిదర్శనమన్నారు.

పలువురికి ఆర్థికసాయం

ఇచ్ఛాపురం : ఆర్థికసాయం అందజేస్తున్న గ్రామస్తులు

ఇచ్ఛాపురం : మండలంలోని అరకభద్రకు చెందిన సోమేష్ కేన్సర్‌తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న యువకులు బాధితుడికి ఆర్థికసాయం అందించారు. గతంలో వైద్యం తీసుకున్నా మరలా వ్యాధి తిరగబడటంతో వైద్యానికి, కుటుంబం పోషణకు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్నారు. ఈ మేరకు రూ.62,500 వసూలు చేసి బుధవారం సోమేష్ తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో సీడాప్ మాజీ చైర్మన్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.
కవిటి: మండలంలోని బొరివంకకు చెందిన మజ్జి సుజాత కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ కొరకు ఫిస్టులా చేయించుకున్నారు. కానీ, అది వికటించడంతో చేయి వాపు వచ్చి తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దీంతో రెక్కాడితే గాని డొక్కాడని సుజాత తన వైద్య పరీక్షల ఖర్చులకు దాతల సాయం కోసం ఎదురు చూసింది. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన హెల్పింగ్ హేండ్స్ సభ్యుడు కాళీ సాహూ తమ సంస్థ ద్వారా, ఆపదలో ఆదుకునేందుకు ముందుండే దాతల ద్వారా సుజాత వైద్యం కోసం నగదు సేకరించారు. ఆ విధంగా సమకూరిన రూ.42 వేలతో పాటు రెండు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులను బుధవారం సుజాతకు స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బెందాళం శ్రీరామ్ ప్రసాద్, ఎంపిటిసి దుద్ది సతీష్, ఎంపిటిసి మాజీ సర్పంచ్ విజయకృష్ణ, పాండవ చంద్రశేఖర్, లక్ష్మణమూర్తి మాస్టారు పాల్గొన్నారు.

కవిటి : ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

రూ.50 వేలు విరాళం
టెక్కలి రూరల్ : టెక్కలి జిల్లా ఆస్పత్రి ఆవరణలోని సత్యసాయి నిత్య అన్నపూర్ణ సేవ సంఘానికి రూ.50 వేలు విరాళంగా ఏలూరి సత్యనారాయణ, ఏలూరి లక్ష్మీనరసింహారావు కుటుంబ సభ్యులు బుధవారం అందజేశారు. తన మాతృమూర్తి జ్ఞాపకార్థం నిత్య అన్నదానానికి విరాళం అందజేశారు.

సాహితీ జాతాకు కుమార్ రాజుకు ఆహ్వానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యాన అంతర్జాతీయ చైర్మన్ కత్తి మండ ప్రతాప్ నేతృత్వాన ఈ నెల 19, 20 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లి గూడెం బుద్దాల కన్వెన్షన్ హాలులో 24 గంటల పాటు జరిగే ప్రపంచ తెలుగు సాహిత్య కళా జాత నిర్వహించనున్నారు. ఈ కళాజాతలో పాల్గొనేందుకు జిల్లా నుంచి గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజుకు ఆహ్వానం అందింది. ఈ సాహితీ కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని కుమార్ రాజు తెలిపారు.

కుమార్ రాజు

ఆధార్ మెగా శిబిరం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఆధార్ మెగా శిబిరాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని తపాలా కార్యాలయ హెడ్ పోస్ట్ మాస్టర్ డి. చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం పట్టణంలోని తపాలా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేషనల్ పోస్టల్ వీక్ వారోత్సవాల సందర్భంగా గురువారం అంత్యోదయ దినస్‌గా ప్రకటించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రధాన తపాలా కార్యాలయంలో ఆధార్ మెగా శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ మెగా శిబిరంలో కొత్త ఆధార్ నమోదు, ఆధార్ కార్డులోని పొరపాట్లు సరిదిద్దడం వంటి సేవలు అందజేయబడునని తెలిపారు. ఈ మెగా శిబిరం సేవలను సమీప గ్రామీణ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

మాట్లాడుతున్న హెడ్ పోస్ట్‌మాస్టర్ చంద్రశేఖర్

స్టాంప్‌ను ఆవిష్కరిస్తున్న వివేకానంద

స్టాంప్ ఆవిష్కరణ

టెక్కలి: టెక్కలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఎపి న్యాయవాదుల గుమస్తాల సంక్షేమ నిధికి రూ.250 సింగిల్ స్టాంప్‌ని బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద బుధవారం ఆవిష్కరించారు. న్యాయస్థానాల్లో దాఖలు చేసిన వకాళ్ల మెమో ఆఫ్ అప్పీయరెన్స్‌పై ఈ స్టాంప్ అతికించాలన్నారు. స్టాంప్ విక్రయం ద్వారా వచ్చిన సొమ్మును న్యాయవాదులు, వారి గుమస్తాల సంక్షేమానికి వినియోగించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.దివాకర్, న్యాయవాదులు దవళ రాజేశ్వరరావు, పేడాడ బాబూరావు, పి.సాయిరాజ్, ఎం.గోవింద్, పైల చంద్రుడు, భుజంగరావు, పొట్నూరు ఆనందరావు పాల్గొన్నారు.

అక్షరాభ్యాసంలో పాల్గొన్న విద్యార్థులు

సామూహిక అక్షరాభ్యాసాలు

కవిటి: సరస్వతి దేవి పూజను పురస్కరించుకుని కవిటి కొత్తూరు ఆర్ష విజ్ఞాన భారతి, కవిటి కళ్యాణి ఆంగ్ల పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనిల్, బిందు మాధవి తదితరులు పాల్గొన్నారు.

డిటి బాధ్యతల స్వీకరణ

మందస: మందస మండల డిప్యూటీ తహశీల్దార్‌గా కె.రామకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు ఈయన పలాస ఆర్‌డిఒ కార్యాలయంలో పనిచేస్తూ డిటిగా నియమితులయ్యారు. ఇప్పటి వరకు పని చేసిన డిటి ఎం.కృష్ణమూర్తి కవిటి బదిలీ అయ్యారు. రీ సర్వే డిటిగా సుబ్రమణ్య శర్మ కూడా బాధ్యతలు స్వీకరించారు.

రామకృష్ణ, డిటి

20న ఆర్‌టిసి విశ్రాంత ఉద్యోగుల మహాసభ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆర్‌టిసిలో ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించి విశ్రాంత జీవనం సాగిస్తున్న విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై చర్చ జరగాల్సిన అవసరం ఉందని ఆర్‌టిసి విశ్రాంత ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ అప్పారావు, ఎస్ఎస్ఆర్ శర్మలు అభిప్రాయపడ్డారు. బుధవారం అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఆర్.ప్రసాదరావు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసోసియేషన్ రాష్ట్ర మహాసభలను ఈనెల 20న విజయవాడలో నిర్వహించి సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. అషోషియేషన్ సభ్యులుగా ఉండి ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన రిటైర్డు ఉద్యోగులకు సమావేశంలో శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలకు పెద్దసంఖ్యలో రిటైర్డు ఉద్యోగులు హాజరు కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కార్యనిర్వాహక అధ్యక్షులు కె. సుమన్, ఎం.పెంటయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు, పాలకొండ కార్యదర్శి ఆర్.రామారావు, పలాస కార్యదర్శి ఎన్.కె.రావు, టెక్కలి కార్యదర్శి ఎం. రామారావు, ఎ.వి.రమణ తదితరులు హాజరయ్యారు.

మాట్లాడుతున్న అప్పారావు

జంగిల్ క్లియరెన్స్ చేపట్టరూ..?

రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని చిగురువలస సమీపంలో ఉన్న పాలకొండ - సరుబుజ్జిలి ప్రధాన రహదారి అడవిని తలపిస్తుంది. ఒకప్పుడు అడవి రోడ్డు అని పేరుగాంచిన ఈ రహదారి ప్రస్తుతం రోడ్లు భవనాల శాఖ అధికారులు నిర్లక్ష్య ధోరణితో అటవీ ప్రాంతంలో నడక మార్గంగా కనిపిస్తుంది. రోడ్డుకి ఇరువైపులా భారీస్థాయిలో వివిధ రకాల పిచ్చి మొక్కలు పెరిగి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పాలకొండ నుంచి సరుబుజ్జిలి, హిరమండలం, పాతపట్నం ప్రాంతాలకు ఒకప్పుడు వాహనాలు మాత్రమే వచ్చేవి. ప్రస్తుతం తెలికిపెంట వద్ద వంశధార నదిపై వంతెన ఏర్పడిన తర్వాత టెక్కలి, నరసన్నపేట, పలాస, ఇచ్ఛాపురం, బరంపురం ప్రాంతాలకు కూడా భారీస్థాయిలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అటువంటి రహదారి ముళ్ల పొదలతో నిండి ఉండటంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాల తప్ప రోడ్డుకి ఇరువైపుల నుంచి వచ్చే మనుషులు, పశువులు, ఇతర వాహనాలను గుర్తించడం కష్టతరంగా మారి అప్పుడప్పుడు ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా రోడ్లు భవనాల శాఖాధికారులు స్పందించి ఈ రహదారిలో ముళ్లపొదల తొలగింపు చేపట్టి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సిసి రోడ్ల నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి- మందస

15వ ఆర్థిక సంఘం నిధులతో మండలంలోని సిసి రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్న టిడిపి మండల అధ్యక్షులు భావన దుర్యోధన తెలిపారు. టిడిపి కార్యాలయంలో బుధవారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రతిష్టాత్మకంగా చేపట్టబోతున్న మన పలాస-మన బాధ్యత కార్యక్రమంలో కూటమి నాయకులందరూ పాల్గొని రోడ్లపై ఉన్న జంగి క్లియరెన్స్ పూర్తి చేయాలని కోరారు. అలాగే ఉపాధి హామీ, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి మంజూరైన సిసి రోడ్లు, డ్రెయిన్ల పనులను ఈ నెల 15న ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి బమ్మిడి కర్రయ్య, జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, తమిరి భాస్కరరావు, గువ్వాడ లక్ష్మీనారాయణ, ముడిమంచి నవీన్‌కుమార్, గార కృష్ణారావు, సవర లకియా, సవర శంకర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దుర్యోధన

సౌత్‌జోన్ అథ్లెటిక్స్ విజేత తులసి

ప్రజాశక్తి- బూర్జ

సౌత్‌జోన్ అథ్లెటిక్స్ విజేతగా సందుల తులసి నిలిచింది. బూర్జ మండలం కురుంపేటకు చెందిన తులసి కె.కె.రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుని ప్రస్తుతం పాలకొండ పట్టణంలోని కేశవ సాయి జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. సౌత్‌జోన్ అథ్లెటిక్స్ జిల్లాస్థాయి రేస్ వాల్ పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచింది. అనంతరం తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్‌లో ఈనెల నాలుగు నుంచి ఆరవ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి రేస్‌వాల్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచింది. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన తులసిని పిఇటి అప్పన్న, కళాశాల ప్రిన్సిపాల్ పి.వెంకటరమణతో పాటు గ్రామపెద్దలు అభినందించారు

పతకాలతో తులసి

ఘనంగా సరస్వతి పూజ

పూలమాల వేస్తున్న రాజశేఖర్

టెక్కలి : స్థానిక విజ్ఞాన్ పాఠశాలలో ప్రిన్సిపాల్ రాజశేఖర్ సరస్వతి దేవి విగ్రహానికి బుధవారం పూలమాలలు వేశారు. 70 ఏళ్ల క్రితం నిర్మించిన విగ్రహం అందరూ వినియోగించుకునేందుకు వీలుగా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, భారతి, శివ, తిరుపతి, ఆట్ల సింహాద్రి పాల్గొన్నారు.

బంగార్రాజుకు సన్మానం

పాతపట్నం : ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా నెల్లిమర్ల టిడిపి ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు బాధ్యతలను స్వీకరించారు. ఈ మేరకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు నివాసంలో బంగార్రాజుకు బుధవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సిర్ల ప్రభాకరరావు, రామారావు, శంకర్ పాల్గొన్నారు.

గజమాలతో సన్మానిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

భూ సమస్యలను పరిష్కరిస్తాం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలో భూ రీ సర్వేలో జరిగిన తప్పులను పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని తహశీల్దార్ దిలీప్ చక్రవర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఆట్ల సరోజినమ్మ అధ్యక్షతన బుధవారం మండల సమావేశం నిర్వహించారు. రీ సర్వేలో జరిగిన తప్పులను సవరిస్తున్నామని, రైతులు మీ సేవ, రైతు సేవా కేంద్రంలో ఆన్‌లైన్‌లో అప్‌లే చేయాలన్నారు. తలగాం సర్పంచ్ హనుమంతు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తలగాం నుంచి పెద్దరోకలి పెళ్లి విద్యుత్ లైన్‌ను సరిచేయాలని కోరారు. ఎపిఒ బగాది ప్రసాదరావు మాట్లాడుతూ ఉపాధి హామీ కింద రూ.415 కోట్లు పనులు గుర్తించామని, ఈనెల 14 నుంచి పండగ వాతావరణంగా వారం రోజుల పాటు పనులు నిర్వహించడానికి ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ చింతా లక్ష్మీబాయి, వైస్ ఎంపిపిలు పేడాడ రమేష్, మన్నెల కిషోర్, ఎంపిటిసిలు కూన పార్వతి, బమ్మిడి కూర్మారావు, సర్పంచ్‌లు బగాది రామకృష్ణ, ఎఒ జి.రంగరావు, ఎంఇఒ దల్లి తులసిరెడ్డి, ఎఇ టి.ఈశ్వరరావు, ఎపిఎం ఉమారాణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ దిలీప్ చక్రవర్తి

ఎంపిడిఒల బాధ్యతల స్వీకరణ

ఎంపిడిఒకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జయంతి ప్రసాద్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈయన పాతపట్నంలో పనిచేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధికారులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

లావేరు : మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పి.వెంకట రాజు బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు ఆమదాలవలస ఎంపిడిఒగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన కె.సురేష్ కుమార్ విజయ నగరం జిల్లా సంతకవిటి మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సహకారంతో కష్టపడి పని చేస్తానన్నారు. ఎంపిడిఒను కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కాన్షీరాంకు నివాళి

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాన్యువర్ కాన్షీరాం వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం కాన్సీరాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గురుబెల్లి సత్యనారాయణ, డిహెచ్‌పిఎస్ అధ్యక్షులు తెప్ప పాపారావు, ప్రధాన కార్యదర్శి నగరి తారకేశ్వరరావు, చెల్లూరు పద్మలోచనం, బోకర దుర్యోధన, బోనెల ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

పూలమాలలు వేస్తున్న పాపారావు

కొత్తూరు : మండలంలోని కర్లెమ్మ పంచాయతీ నేతాజీనగర్ కాలనీలో కాన్షీరాం చిత్రపటానికి బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొడ్డేపల్లి కృష్ణారావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు వడమ శ్రీనివాసరావు, ఎండు నాయుడు, దండు ప్రకాశరావు, పోలయ్య, శివకృష్ణ పాల్గొన్నారు.

సంఘాలను బలోపేతం చేయాలి

సురేష్‌కు మొక్కను అందజేస్తున్న వెలుగు ఎపిఎం, సిబ్బంది

ప్రజాశక్తి- లావేరు

స్వయం శక్తి సంఘాలు బలోపేతం దిశగా వెలుగు సిబ్బంది పనిచేయాలని టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ అన్నారు. వెలుగు ఎపిఎం బి.వి.సుబ్బయ్య నాయుడు, సిసిలు మండలానికి బదిలీపై వచ్చారు. బుధవారం తాళ్లవలసలో సురేష్‌ను వీరంతా మర్యాద పూర్వకంగా కలిశారు.

వెలుగు సిబ్బంది కష్టపడి సంఘాలను బలోపేతం చేస్తూ రుణాల లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఎపిఎంతో పాటు అదపాక సిసి ఎల్.అసిరినాయుడు, బెజ్జిపురం విజయకుమారి, ఎన్.రమేష్, మురపాక జానికి, వెంకటాపురం పెంటయ్య, మోహన్‌కుమార్ తదితరులున్నారు.

బోరు ప్రారంభం

బోరును ప్రారంభిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని గొండ్యాలపుట్టుగలో మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.5 లక్షలతో వేసిన తాగునీటి బోరును ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ బుధవారం ప్రారంభించారు. అనంతరం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8 లక్షలతో గ్రామంలో డ్రెయినేజీ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు బెందాళం రమణమూర్తి, దుద్ది రమణ, దేవాడ దుర్యోధన పాల్గొన్నారు.

భూమిని ఆక్రమించారు

పలాస: మండలంలోని గరుడుఖండి రెవెన్యూ పరిధి సర్వే నంబరు 39/2లో ఉన్న తన భూమిలో తన పొలం పక్కన ఉన్న సర్వే నంబరు 39/1లో ఉన్న వ్యక్తి బొత్స ముఖలింగం కొంత మేరకు ఆక్రమించి ప్రహరీ నిర్మించారని అదే గ్రామానికి చెందిన రైతు సాసుమాన హేమసుందరరావు వాపోయారు. ఈ మేరకు బుధవారం విలేకరులకు ఆక్రమించుకున్న భూమిని చూపించారు. దీనిపై రెవెన్యూ, పోలీసులు యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆక్రమణను చూపిస్తున్న హేమసుందరరావు